క్లుప్తంగా

రేషన్ సరుకుల నాణ్యతపై ప్రజాభిప్రాయ సేకరణ

కర్నూలు(సెంట్రల్): సివిల్ సప్లై ద్వారా సరఫరా అవుతున్న నిత్యావసర సరుకులు, బియ్యం నాణ్యతగా ఉండేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఇన్‌చార్జి జేసీ/డీఆర్వో కె.మధుసూదన్‌రావు కోరారు. బుధవారం ఆయన డీఎస్‌ఓ ప్రసాద్‌తో కలసి ఇందిరాగాంధీ మెమోరియల్ ఉన్నత పాఠశాల, నిర్మల నగర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది, ఉపాధ్యాయుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. అక్కడ నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి సీఆర్‌ఈ వర్క్‌షాప్

కర్నూలు కల్చరల్: హేమ్ చంద్ దేవ్ చంద్ చారిటీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సేవలందిస్తున్న అంబికా శిశు కేంద్రంలో ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్, ఇండియన్ స్కేల్ ఫర్ అసెస్‌మెంట్ ఆఫ్ ఆటిజం అంశాలపై రిహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆమోదించిన రాష్ట్రస్థాయి సీఆర్‌ఈ వర్క్ షాప్‌ను ఈనెల 2, 3 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు అంబికా శిశు కేంద్రం డైరెక్టర్ బిందు షా పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ బుధవారం మాట్లాడుతూ.. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ బాధితులకు రాష్ట్ర మెడికల్ బోర్డు ఇచ్చే సర్టిఫికెట్‌తో కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

మాజీ సైనికుడి మృతి


నారాయణరెడ్డి (ఫైల్)

కర్నూలు(అర్బన్): నగర శివారులోని కాదంబరి ఎస్టేట్‌లో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు పి.నారాయణరెడ్డి అనారోగ్యంతో బుధవారం ఉదయం మృతి చెందారని జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్రా పేరయ్య తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నారాయణరెడ్డి ఏఎంసీలో నాయక్‌గా 22 సంవత్సరాలు విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారన్నారు. ఆయన మృతి పట్ల సంక్షేమ సంఘం తరపున సంతాపం ప్రకటించారు. మాజీ సైనికుల కుటుంబాలకు సంఘం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు.

చిరస్మరణీయుడు జంపా

కర్నూలు(హాస్పిటల్): మరణించినా సమాజానికి ఉపయోగపడాలన్న జంపా కృష్ణకిశోర్ ఆశయం గొప్పదని జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) వ్యవస్థాపకులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి చెప్పారు. స్థానిక బిర్లాకాంపౌండ్‌లోని జేవీవీ జిల్లా కార్యాలయంలో జంపా ప్రథమ వర్ధంతిని నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 'మరణంలోనూ జీవిస్తున్న మన జంపా' పుస్తకావిష్కరణ చేశారు. డాక్టర్ బ్రహ్మారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్ మాట్లాడుతూ జంపా కృష్ణకిశోర్ తుది శ్వాస వరకు ప్రజల్లో అజ్ఞానాన్ని తొలగించేందుకు పాటుపడ్డారని, మరణం తర్వాత తన శరీరాన్ని వైద్య విద్యార్థులకు ఉపయోగపడేలా సిద్ధార్థ మెడికల్ కాలేజీకి అందజేశారని కొనియాడారు. జేవీవీ నాయకులు మహమ్మద్ మియ్యా, బాషా, కొండమ్మ, శ్రీరాములు, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

కర్నూలు (టౌన్): పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నగరపాలక కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ హెచ్చరించారు. ఆయన బుధవారం నగరపాలక సంస్థ పరిధిలోని 5, 6వ డివిజన్, 9వ డివిజన్‌లోని శ్రీరామనగర్, దేవనగర్, బిర్లా క్వార్టర్స్, బాపూజీ నగర్, బుధవారపేట కాలనీలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కాల్వల్లో పూడిక తొలగించాలని, వ్యర్థాల కుప్పలను మధ్యాహ్నం లోపు తీసివేయాలన్నారు. అనంతరం సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. శానిటేషన్ సూపర్‌వైజర్లు నాగరాజు, ఇన్‌స్పెక్టర్లు ముర్తుజావలీ, రమేష్ బాబు, అనిల్ పాల్గొన్నారు.

నాటక పోటీ విజేతలకు సన్మానం

కర్నూలు కల్చరల్: అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో తిరుపతి మహతి ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ స్థాయి పద్య, సాంఘిక నాటక ప్రదర్శన పోటీల్లో విజేతలుగా నిలిచిన 'శ్రీకృష్ణ కమల పాలిక' పద్య నాటకం కళాకారులను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ఘనంగా సన్మానించారు. బుధవారం ఆయన ఛాంబర్‌లో నాటక దర్శకులు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కళాకారులు మహమ్మద్‌మియ్యా, సంగా ఆంజనేయులు, పాండురంగయ్య, గాండ్ల లక్ష్మన్న, లక్ష్మీకాంత రావు, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసులు, సామ్యు యేల్, రాజారత్నం, బాల వెంకటేశ్వర్లు, యాంగటీశ్వరప్పలను సన్మానించారు.

ఆర్‌యూ అభివృద్ధికి సహకరించండి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం అభివృద్ధికి సహకరించాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని విన్నవించారు. బుధవారం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు.

'దార్శనికుడు పూలే' పుస్తకావిష్కరణ

కర్నూలు(సెంట్రల్): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిశోధన విద్యార్థి, బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పగడాల ఆనంద్ బాబు రచించిన 'దార్శనికుడు పూలే' పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆవిష్కరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని చాంబరులో పుస్తకాన్ని ఆవిష్కరించి రచయితను అభినందించారు.

లక్షణాలు – సంకేతాలు

ఊపిరితిత్తుల క్యాన్సర్ సాధారణంగా ప్రారంభ దశలలో సంకేతాలు, లక్షణాలను కలిగించదు. వ్యాధి ముదురుతున్నప్పుడు లక్షణాలు కనిపిస్తాయి. నిరంతర దగ్గు, దగ్గినప్పుడు రక్తం పడటం, శ్వాస ఆడకపోవడం, ఛాతిలో నొప్పి, బరువు తగ్గిపోవడం, ఎముకల నొప్పి, తలనొప్పి, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి.

ఊపిరితిత్తుల క్యాన్సర్ రకాలు

➤ స్మాల్‌సెల్ లంగ్ క్యాన్సర్: ఇది చిన్న కణాల ఊపిరితిత్తుల క్యాన్సర్, ఎక్కువగా ధూమపానం చేసేవారికి సంభవిస్తుంది.

➤ నాన్ స్మాల్ సెల్ క్యాన్సర్: ఇందులో ఊపిరితిత్తులలో వివిధ రకమైన క్యాన్సర్ కణాలు ఉంటాయి. (స్క్యామాసెల్ క్యాన్సర్, అడెనోకార్సినోమా, పెద్ద కణ క్యాన్సర్)



ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు కారణాలు

సరదా తీర్చుకునేందుకు, ఒత్తిడి తగ్గించుకునేందుకు, అలవాటుగా మారిందని చాలా మంది ధూమపానం చేస్తున్నారు. అలవాటుగా మారిన ధూమపానం క్యాన్సర్ మహమ్మారికి దారితీసి ప్రాణాలు తోడేస్తోంది. ధూమపానం చేయని వారికంటే, చేసేవారిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం 24 నుంచి 35 రెట్లు ఎక్కువగా ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సిగరెట్లు కాల్చే వారి పక్కన ఉండి వారు వదిలిన గాలి పీల్చడం(పాసివ్ స్మోకింగ్) కూడా 3.5 శాతం ప్రమాదాన్ని పెంచుతుంది. దీంతో పాటు గాలి కాలుష్యం, గతంలో చేసిన రేడియేషన్ థెరపీ, వంటచేసే సమయంలో ఉత్పత్తి అయ్యే రాడన్ గ్యాస్ పీల్చడం, ఆర్సెనిక్ క్రోమియం, నికెల్ ఆస్బెస్టాస్, ఇతర పదార్థాలు పీల్చడం ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పును పెంచుతుంది.

ప్రభుత్వాస్పత్రిలో ఆధునిక వైద్యసేవలు



కర్నూలులో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వచ్చాక ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో వచ్చిన వారికి కీమోథెరపి, శస్త్రచికిత్సలు చేస్తున్నాం. ఇవి నిర్వహించేందుకు సర్జికల్, మెడికల్ ఆంకాలజిస్టులు ఉన్నారు. ప్రస్తుతం ఏడాదికి 70 నుంచి 80 మందికి శస్త్రచికిత్సలు, 60 మందికి కీమోథెరపి ఇస్తున్నాం. – **డాక్టర్ సీఎస్‌కే ప్రకాష్, క్యాన్సర్ విభాగం హెచ్‌ఓడీ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల**

ఊపిరి తీస్తున్న మహమ్మారి

- జిల్లాలో పెరుగుతున్న ఊపిరితిత్తుల క్యాన్సర్ బాధితులు
- ధూమపానం చేయడమే ప్రధాన కారణం
- వాతావరణ కాలుష్యమూ కారణమే
- నేడు ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ నివారణ దినోత్సవం


కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ భవనం

కర్నూలు(హాస్పిటల్): మాయదారి కాలుష్యం, పొగ ఊపిరిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. క్రమంగా అది క్యాన్సర్‌కు దారి తీస్తోంది. అలాగే సరదాగా తాగే ధూమపానం క్రమంగా ఊపిరితిత్తులను దెబ్బతీస్తోంది. క్యాన్సర్‌గా మారి ప్రాణాలకే ఎసరు తెస్తోంది. ధూమపానం ఆరోగ్యానికి హానికరమని సిగరెట్ పెట్టెలు, బీడీ కట్టలపై ఉన్నా దాని గురించి పట్టించుకునే వారు ఎవ్వరూ లేరు. ఆ పూటకు దమ్ము లాగితే వచ్చే ఆనందం చాలనుకుంటున్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ రావడానికి గల కారణాలు, తీసుకునే చికిత్సలపై అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం ఆగస్టు 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ఊపిరితిత్తుల క్యాన్సర్ నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

జిల్లాలో ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఆధునిక వైద్య సదుపాయాలు, ఈ వ్యాధికి ఆరోగ్యశ్రీలో ఉచితంగా వైద్యం అందిస్తుండటంతో చాలా మంది చికిత్స తీసుకుని కోలుకుంటున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాన్సర్ విభాగానికి ప్రతి సంవత్సరం 600 మందికి పైగా రోగులు చికిత్స కోసం వస్తుండగా అందులో 110 మందికి పైగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడే వారున్నారు. వీరిలో అధిక శాతం 3, 4 స్టేజీలలో చికిత్స కోసం వస్తుండగా 10 శాతం మంది కోలుకోలేక మరణిస్తున్నారు. ఈ క్యాన్సర్‌కు చికిత్స అందించేందుకు ఆసుపత్రిలో ఇద్దరు సర్జికల్ ఆంకాలజిస్టులు ఉన్నారు. వీరు ఊపిరితిత్తుల్లో ఏర్పడిన క్యాన్సర్ కణితులను తొలగించడం, దెబ్బతిన్న ఊపిరితిత్తిలోని కొంత భాగాన్ని తీసివేయడం చేసి అనంతరం కీమోథెరపీ చికిత్స అందిస్తున్నారు. ఈ ఆసుపత్రితో పాటు కర్నూలు నగరంలోని ఒమెగా హాస్పిటల్, విశ్వభారతి క్యాన్సర్ హాస్పిటల్‌లోనూ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా క్యాన్సర్ రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఆయా ఆసుపత్రుల్లోనూ ప్రతిరోజూ కొత్త, పాత రోగులు 150 నుంచి 200 మంది చికిత్స కోసం వెళ్తుండగా అందులో ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో వచ్చే వారు 40 మంది దాకా ఉంటున్నారు.

అందుబాటులోకి స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ విభాగం గత మార్చిలో అందుబాటులోకి వచ్చింది. రూ.120 కోట్లతో 120 పడకల సామర్థ్యంతో నిర్మించిన ఈ విభాగంలో అత్యాధునిక లీనియర్ ఆక్సలరేటర్ (రేడియేషన్ మిషన్), ఎక్స్‌టర్నల్ ఆర్‌టీ మిషన్, బ్రాచిథెరపి హెచ్‌డీఆర్ (నేరుగా క్యాన్సర్ కణితిపై రేడియేషన్ ఇస్తారు), సిటీ సిమిలేటర్, ప్రత్యేకంగా రేడియాలజీ విభాగం, పెథాలజి, మైక్రోబయాలజి విభాగాల సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. వీటితో పాటు రేడియేషన్ థెరపిస్ట్, మెడికల్ రేడియేషన్, సర్జికల్ రేడియేషన్, సర్జికల్ ఆంకాలజిస్ట్, పీడియాట్రిక్ సర్జరీ పోస్టులు, స్టాఫ్‌నర్సులు, పారామెడికల్ సిబ్బంది, నాల్గవ తరగతి సిబ్బందిని నియమించాల్సి ఉంది. ప్రస్తుతం క్యాన్సర్ రోగులకు ఇక్కడే ఓపీతో పాటు ఇన్‌పేషంట్లను చేర్చుకుని వైద్యసేవలు అందిస్తున్నారు.

రోగ నిర్ధారణ, చికిత్స

ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉన్నవారు సంవత్సరానికి ఒకసారి స్క్రీనింగ్ సీటీ స్కాన్ చేయించుకోవాలి. వ్యాధి లక్షణాలను బట్టి ఛాతి ఎక్స్‌రే, ఛాతి సీటీ స్కాన్, కఫం సైటోలజి పరీక్షలు వైద్యులు చేయిస్తారు. రోగనిర్ధారణ, క్యాన్సర్ రకాన్ని గుర్తించేందుకు టిష్యూ బయాప్సీ అవసరం అవుతుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స ఆ క్యాన్సర్ దశపై ఆధారపడి ఉంటుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రస్తుతం శస్త్రచికిత్స, కీమోథెరపి, రేడియోథెరపి వివిధ చికిత్సా విధానాలు అందుబాటులో ఉన్నాయి.

ధూమపానంతో ఊపిరితిత్తుల క్యాన్సర్



2035 నాటికి ప్రపంచ వ్యాప్తంగా ఏటా 3 మిలియన్ల మంది ఊపిరితిత్తుల క్యాన్సర్ వల్ల మరణిస్తారని అంచనా. బాధితుల్లో ధూమపానం కారణంగా క్యాన్సర్ బారిన పడినవారు 85 నుంచి 90 శాతం మంది ఉండే అవకాశం ఉంది. సీఓపీడీ బాధితుల్లోనూ ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను గుర్తిస్తున్నాం. ధూమపానం అలవాటు ఉన్న 50 ఏళ్ల వయస్సు పైబడిన వారు ఏటా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష చేయించుకోవాలి. అవసరమైతే హెచ్‌ఆర్ సీటీ (చెస్ట్), పెట్ స్కాన్ పరీక్షలు చేయించుకోవాలి. – **డాక్టర్ వినోద్ ఆచారి, ఊపిరితిత్తుల వ్యాధుల నిపుణులు, కర్నూలు**

ఆత్మీయ వీడ్కోలు


డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైద్యాధికారులు


అడిషనల్ ఎస్పీ నాగరాజు దంపతులను సత్కరిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ అందించిన సేవలు ఎనలేనివని అతిథులు కొనియాడారు. ప్రాంతీయ కంటి ఆసుపత్రిలోని సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం డీఎంహెచ్‌ఓ పదవీ విరమణను పురస్కరించుకుని అధికారులు, వైద్యులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. అలాగే పదవీ విరమణ పొందిన వ్యాధినిరోధక టీకాల విభాగం కోల్డ్‌చైన్ టెక్నీషియన్ శంకరయ్య సన్మానించారు. జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

– కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల దంత శస్త్ర చికిత్స విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ బి.భవానీ, స్టాఫ్ నర్సు ఏఎస్. గీతాకుమారిని సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, తదితరులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

➤ కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లో ఈ–సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు పదవీ విరమణ కార్యక్రమాన్ని పొదుపు భవన్‌లో నిర్వహించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్/డీఆర్వో కె.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

➤ కర్నూలు: సుదీర్ఘకాలం పాటు పోలీసు శాఖలో పనిచేసి పదవీ విరమణ పొందిన అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజును జిల్లా పోలీసు శాఖ తరఫున ఘనంగా సత్కరించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ దంపతులను ఎస్పీ బిందుమాధవ్ పూలమాల, శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. అలాగే పదవీ విరమణ పొందిన త్రీటౌన్ పీఎస్ మహిళా ఏఎస్‌ఐలు సుజాత కుమారి, జెడ్.సుశీల, కోసిగి పీఎస్ ఏఎస్‌ఐ ప్రేమలీల, పత్తికొండ హెడ్‌కానిస్టేబుల్ కె.మోహన్ రావును సత్కరించి వీడ్కోలు పలికారు.

ఓటు వేద్దాం.. సభ్యులను గెలిపించుకుందాం

- కార్పొరేటర్లకు దిశానిర్దేశం చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు


మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి, పక్కన రామయ్య, కాటసాని, సత్యనారాయణమ్మ తదితరులు

కర్నూలు (టౌన్): కావాల్సినంత బలం ఉంది. ప్రతి ఒక్క కార్పొరేటర్ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఓటు వేసి వైఎస్సార్‌సీపీ నుంచి బరిలో ఉన్న ఐదుగురు సభ్యులను గెలిపించాలని పార్టీ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానికంగా ఒక హోటల్‌లో స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి కార్పొరేటర్లకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి కార్పొరేటర్‌కు ఓటు వేసే విధానాన్ని క్షుణ్ణంగా వివరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిత్రా సత్యనారాయణమ్మ, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కో–ఆర్డినేటర్ ఎస్వీ మోహన్ రెడ్డి, నగర మేయర్ బీవై రామయ్య, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్నూలు నగరపాలకకు 2024–25 సంవత్సరానికి సంబంధించి స్టాండింగ్ కమిటీకి ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. కౌన్సిల్‌లో వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు 33 మంది ఉన్నారన్నారు. మెజార్టీగా వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్లు ఉండటంతో అందరం కలిసికట్టుగా స్టాండింగ్ కమిటీ సభ్యులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పార్టీకి కట్టుబడి పనిచేద్దామని, ధిక్కరించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుక, నాయకల్లు అరుణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నేడు, రేపు మాత్రమే పింఛన్ల పంపిణీ

- తరువాత యాప్ పనిచేయదు
- లబ్ధిదారులకు ముందుగానే సమాచారం ఇవ్వాలి
- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ఆగస్టు నెలలో సామాజిక పింఛన్లను 1, 2 తేదీల్లో మాత్రమే పంపిణీ చేస్తారని, దీనిపై లబ్ధిదారులకు ముందుగానే సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పెన్షన్ల పంపిణీపై మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లతో ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. గత నెలలో కొన్ని మండలాల్లో ఉదయం 11, 12 గంటలైనా పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కాలేదని, ఈసారి ఆ విధంగా జరిగితే సంబంధిత మండలాల ఎంపీడీఓలు, ప్రత్యేకాధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ప్రతి గ్రామంలో ఉదయం 6 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభం కావాలన్నారు. రెండు రోజులపాటు మాత్రమే పింఛన్ల పంపిణీ జరుగుతుందని, తరువాత యాప్ పనిచేయదన్న విషయాన్ని లబ్ధిదారులకు వివరించి చెప్పాలన్నారు. పెన్షన్లకు సంబంధించిన నగదు విత్‌డ్రాలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, ఎల్‌డీఎం రామచంద్రరావు పాల్గొన్నారు.

ప్రైవేటుకు మేలు చేసేలా..!

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కొందరు అనధికార వ్యక్తులు రాజ్యమేలుతున్నారు. ఏఎంసీ, క్యాజువాలిటీల్లో తిష్టవేసి ఆసుపత్రికి అప్రతిష్ట తీసుకొస్తున్నారు. ఇక్కడ పరికరాలు, ఆక్సిజన్ ఎక్విప్‌మెంట్ పనిచేయడం లేదని వదంతులు సృష్టించి రోగులను ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లేలా చేస్తున్నారు. బుధవారం సైతం ఇలాంటి వదంతులు రావడంతో ఆసుపత్రి అధికారులు అప్రమత్తమయ్యారు. ఏఎంసీ, క్యాజువాలిటీ, నూతన క్యాజువాలిటీలో ఆక్సిజన్ ఫ్రైజర్‌ను పరిశీలించారు. అన్ని పరికరాలు, ఆక్సిజన్ సరిగ్గా పనిచేస్తున్నాయని గుర్తించారు. ఆసుపత్రిలో ఎవ్వరైనా ఇలాంటి వదంతులు సృష్టిస్తే విచారణ చేసి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి హెచ్చరించారు. కొందరు టెక్నీషియన్లు కావాలనే ఇలాంటి వదంతులు సృష్టించి, దానిని సాకుగా తీసుకుని రోగులు భయభ్రాంతులకు గురైతే వారిని ఒప్పించి ప్రైవేటు ఆసుపత్రులకు పంపించి కమీషన్లు తీసుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. వారు ఎవరనే విషయమై విచారణ చేస్తున్నామని చెప్పారు.


ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని, విద్యాశాఖ అధికారులు స్పందించి పని సర్దుబాటు ప్రక్రియ చేపట్టి ఉపాధ్యాయుల కొరత తీర్చాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి కోరారు. ఈ మేరకు డీఈఓ కాగిత శామ్యూల్‌కు వినతి పత్రం అందజేశారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఇసుక డంప్ సీజ్

కర్నూలు (టౌన్): కర్నూలు మండలం ఈ. తాండ్రపాడులో ఇసుక డంప్‌ను బుధవారం మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. అక్కడ పెద్దఎత్తున ఇసుకను నిల్వ చేసినట్లు సమాచారం రావడంతో అధికారులు తనిఖీ చేశారు. సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వం ఇంజినీరింగ్ విభాగాలకు టన్నుకు రూ.335 చొప్పున పంపిణీ చేసినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ వెల్లడించారు. రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది శంకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సర్వం సిద్ధం


కార్పొరేటర్ల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో మేయర్ బీవై రామయ్య, డిప్యూటీ మేయర్లు సిద్దారెడ్డి రేణుక, నాయకల్లు అరుణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి ఓటు వేసే విధానం, పోలింగ్, ఫలితాల లెక్కింపు ప్రక్రియను వివరించారు. అలాగే కార్పొరేటర్లు లేవనెత్తిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. ఎన్నికల్లో కార్పొరేటర్లు పార్టీ కండువాలు, మొబైల్ ఫోన్లు తీసుకురాకూడదని సూచించారు. అలాగే పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలను సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా నగరపాలక స్థాయి సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయన్నారు. తొలిసారి ఎన్నికలు జరుగుతున్నట్లు చెప్పారు. పోలీసు శాఖతో సమన్వయం చేసుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, లోటుపాట్లు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందని చెప్పారు. అత్యధిక ఓట్లు పోలైన ఐదుగురు అభ్యర్థులను విజేతలుగా ప్రకటిస్తామని వెల్లడించారు.

టీకాతో రక్షణ


చిన్నారికి టీకా వేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులకు ప్రాణాంతక వ్యాధులు సోకకుండా టీకా రక్షణ కల్పిస్తుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక ముజఫర్‌నగర్ పరిధిలోని అయ్యప్ప నగర్ సచివాలయంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు. గర్భిణులు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమం తప్పకుండా పిల్లలకు టీకాలు వేయిస్తే వ్యాధుల బారిన పడకుండా కాపాడవచ్చన్నారు. గర్భవతుల వివరాలను 12 వారాల్లోపు నమోదు చేసి సమయానుసారంగా ఆరోగ్య సేవలు అందించాలని, వారు కాన్పుకు వెళ్లాల్సిన ఆసుపత్రిని ముందుగానే గుర్తించి ఆ వివరాలను ఏఎన్‌ఎం యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. హైరిస్క్ గర్భిణులను కాన్పు తేదీకి మూడు రోజులు ముందుగానే ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి సుఖప్రసవం అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆగస్టులో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యాధికారి సుప్రియ, డీపీఎం ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడే ఎన్నికలు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీకి గురువారం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఏడాది కాలానికి సంబంధించి స్టాండింగ్ కమిటీని ఎన్నుకోనున్నారు. గత మూడేళ్లుగా నగరపాలక స్టాండింగ్ కమిటీలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేవారు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ ఏడాది ఎన్నికలు తప్పని పరిస్థితి నెలకొంది. స్టాండింగ్ కమిటీలో ఐదుగురిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. వైఎస్సార్‌సీపీ నుంచి అన్నెపోగు క్రాంతికుమార్, మిద్దె చిట్టెమ్మ, జుబేర్ అహమ్మద్, షేక్ యూనను బాషా, విక్రమ సింహా రెడ్డి, తెలుగుదేశం నుంచి నీలోఫర్ షేక్, జక్కుల రమణమ్మ, విజయకుమారి, శివమ్మ, షాజహాన్ పర్వీన్ పోటీ చేస్తున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరు పోలింగ్ ఉంటుంది. మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల ఫలితాలు వెల్లడిస్తారు.

బలబలాల్లో వైఎస్సార్‌సీపీదే పైచేయి

నగరపాలక సంస్థ పాలకవర్గంలో వైఎస్సార్‌సీపీకి 33 మంది కార్పొరేటర్ల మద్దతు ఉంది. అలాగే టీడీపీకి 18 మంది కార్పొరేటర్లు ఉన్నారు. పోటీల్లో ఐదుగురిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. పూర్తి స్థాయిలో బలం లేకున్నా తెలుగుదేశం నాయకులు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు డబ్బు ఎర వేస్తున్నారు. క్రాస్ ఓటింగ్ ద్వారా నెగ్గాలని టీడీపీ విశ్వ ప్రయత్నాలు చేస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి.

నచ్చిన వారికే పదోన్నతులా..?

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ శాఖ కర్నూలు ట్రాన్స్‌ఫార్మర్ డివిజన్‌లో నచ్చిన వారికి మాత్రమే పదోన్నతులు కల్పించి, నచ్చని వారిని పక్కన పెట్టడం దారుణమని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షుడు పి.నాగరాజు విమర్శించారు. ప్రమోషన్లపై ఉన్నతాధికారులు విచారణ జరిపి అర్హులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగంలో జీఓ ఎంఎస్ నంబరు 45 ప్రకారం ప్రమోషన్ ద్వారా పోస్టులు భర్తీ చేసేందుకు డీపీసీలు ఏర్పాటు చేసి సీనియారిటీ, అర్హతలను పరిగణలోకి తీసుకొని అర్హుల జాబితాలను తయారు చేసి అప్పిలేట్ అథారిటీకి పంపించాల్సి ఉందన్నారు. అథారిటీ ఆమోదించిన తర్వాతనే పదోన్నతులు కల్పించాలని, ఇవేమీ పట్టించుకోకుండా అనుకూలమైన వారికి మాత్రమే ప్రమోషన్లు కల్పించే సాంప్రదాయానికి శ్రీకారం చుట్టడం మంచిది కాదని వాపోయారు. ఈ మేరకు ట్రాన్స్‌ఫార్మర్ డివిజన్ అధికారికి వినతిపత్రం ఇచ్చారు.

నేడు, రేపు కేవీపీఎస్ సభలు

కర్నూలు(సెంట్రల్): కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో ఆగస్టు 1, 2 తేదీల్లో సామాజిక ఉద్యమ సభలను నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.నరసింహులు తెలిపారు. స్థానిక కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహించే ఈ సభలను విజయవంతం చేయాలని కోరారు. బుధవారం కేకే భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ సభల్లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక ఉద్యమాలకు శ్రీకారం చుడతామన్నారు. నాయకులు పీఎస్ రాధాకృష్ణ, ఎం.భాస్కర్, జి.యేసురాజు పాల్గొన్నారు.

బాధ్యతల కేటాయింపు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ సముద్రాల వెంకటేశ్వర్లుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. వర్సిటీ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లును గత నెల 1వ తేదీన వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా నియమిస్తూ అప్పటి వీసీ ప్రొఫెసర్ బి.సుధీర్‌ప్రేమ్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. వర్సిటీ ఆర్థిక వ్యవహారాలు చూడటంతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగుల జీతాలు చెల్లించేందుకు ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ఉన్న వెంకటేశ్వర్లుకు ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ప్రస్తుత ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాలు ఇచ్చారు.